ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తాం..

- సమస్యల సత్వర పరిష్కారానికి కృషి..
- అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సహకారం తీసుకుంటాం
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కొండ్ర నరసింహా

సాక్షి ఫోన్ ఇన్

సత్తుపల్లి: మున్సిపాలిటీలో నెల కొన్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కొండ్ర నరసింహా అన్నారు. సత్వర పరిష్కారానికి నా వంతు ప్రయత్నం చేస్తా. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సహకారంతో అభివృద్ధి పనులను చేపడతాం. సత్తుపల్లి పట్టణ సమస్యలపై గురువారం 'సాక్షి'ఆధ్వర్యాన ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించగా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా పట్టణ ప్రజల ప్రశ్నలకు కమిషనర్ సమాధానాలు ఇచ్చారు.

● డ్రెయినేజీల శుభ్రతపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

– రుత్తల లక్ష్మి, రాజీవ్‌కాలనీ, సత్తుపల్లి

జవాబు: రాజీవ్‌నగర్ అయ్యప్పగుడి వద్ద డ్రెయినేజీ పొంగి రోడ్డుపైకి మురుగు చేరి దుర్వాసన వస్తోందని తెలిసింది. తక్షణమే జేసీబీని పంపించి శుభ్రం చేయిస్తాం. డ్రెయినేజీ ప్రాంతాన్ని విజిట్ చేసి పునరావృతం కాకుండా చర్యలు చేపడతాం.

● రోడ్డుపై సంపు కట్టి వదిలేశారు..

– కిరణ్‌కుమార్, చింతలపాటి వీధి, సత్తుపల్లి

జ: చింతలపాటి వీధి మూలమలుపు వద్ద సంపు కోసం తవ్వి బండలు వేసి రోడ్డుపై వదిలేయడంతో వాహనాలు తిరగలేకపోతున్నారని మా దృష్టికి వచ్చింది. మా సిబ్బందిని పంపించి బండరాళ్లు తొలగించేలా చూస్తాం.

● హనుమాన్ గుడి వెనుక డ్రెయినేజీ కడతారా?

– నాగళ్ల ప్రసాద్, అయ్యగారిపేట, సత్తుపల్లి

జ: హనుమాన్‌గుడి వెనుక డ్రెయినేజీ నీళ్లు వెళ్లేందుకు కొత్త డ్రెయినేజీ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. అమృత్ పథకంలో పైపులైన్ పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం.

● దోమల నివారణపై చర్యలేంటి?

– కాకర్ల మౌనికజగన్, సత్తుపల్లి

జ: గౌతమ్‌మోడల్ స్కూల్ రోడ్‌లోని డ్రెయినేజీ, ఖాళీ స్థలంలోని పిచ్చిమొక్కలతో ఆప్రాంతవాసులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. డ్రెయినేజీ నిర్మాణ పనుల కోసం ఎమ్మెల్యే రాగమయి ప్రతిపాదనలు అడిగారు. ఖాళీ స్థలాలను శుభ్రం చేసేందుకు చర్యలు చేపడతాం.

● డ్రెయినేజీ నీళ్లు ఇంట్లోకి వస్తున్నాయి..

– ఎస్.లక్ష్మయ్య, రిటైర్డ్ ఉద్యోగి, వెంగళరావునగర్

జ: వెంగళరావునగర్ రోడ్ నంబర్ 9లో డ్రెయినేజీ పడిపోయి ఉండడంతో మురుగునీరు ఇంట్లోకి వస్తున్నట్లు చెప్పిన మీ సమస్యలను నోట్ చేసుకున్నాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.



మాట్లాడుతున్న కమిషనర్ నరసింహా

● తాగునీటి పైపులైన్ వేయిస్తారా?

– బండారు ఉమామహేశ్వరరావు, కాకర్లపల్లిరోడ్

జ: కాకర్లపల్లి రోడ్డులో డ్రెయినేజీ సమస్యతో ఇబ్బందిపడుతున్నట్లు తెలిసింది. డ్రెయినేజీ నిర్మాణ పనులపై ప్రతిపాదనలు చేపట్టి ప్రాధాన్యత క్రమంలో నిర్మిస్తాం. పైపులైన్ విస్తరణ పనులు నడుస్తున్నాయి. మీ వీధిలో కూడా వేయిస్తాం.

● విద్యానగర్ సమస్యలు పరిష్కరించండి..

– భీమిశెట్టి సంధ్యరామ్, విద్యానగర్, సత్తుపల్లి

జ: విద్యానగర్ సబ్‌రోడ్‌లో ఉన్న వీధిలోని ఖాళీ స్థలంలో మురుగు చేరి పందులు, కుక్కలతో దుర్వాసన వస్తున్నట్లు చెప్పిన మీ సమస్యలను నోట్ చేసుకున్నాం. ఆ ప్రాంతాన్ని పరిశీలించి తగు చర్యలు చేపడతాం.

● పైపులైన్ వేయించండి..

– కనిగళ్ల గోపాలకృష్ణ, లెనిన్‌రోడ్, సత్తుపల్లి

జ: లెనిన్‌రోడ్‌లో పైపులైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. డ్రెయినేజీలో చెత్తను తక్షణమే తొలగించేందుకు చర్యలు చేపడతాం.



రాజీవ్‌నగర్‌లోని అయ్యప్పగుడి పక్కన రోడ్డుపైకి వచ్చిన మురుగు

● ఇళ్ల ముందు మురుగు నిలవకుండా చేయండి?

– కె.రాంబాబు, కృషిబైపాస్‌రోడ్, సత్తుపల్లి

జ: సత్తుపల్లి టవర్స్ పక్కరోడ్డు నుంచి డ్రెయినేజీలోని మురుగు ఇళ్ల ముందు చేరకుండా చర్యలు తీసుకుంటాం.

● స్పీడ్ బ్రేకర్లు వేయించండి..

– గజ్జల వీరేందర్, కృషిబైపాస్‌రోడ్, సత్తుపల్లి

జ: బైపాస్ రోడ్‌లోని పాలవెంక ట్రాప్ వీధిలో వాహనాలు వేగంగా వెళ్లకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయిస్తాం.

● సిమెంట్‌రోడ్డు తవ్వి వదిలేశారు..

– ఆర్.చంద్రశేఖర్, అడపా సత్యనారాయణ వీధి

జ: మీ వీధిలో తవ్వి వదిలేసిన సిమెంట్‌రోడ్ సమస్యను పరిశీలించి చర్యలు చేపడతాం. ఇంట్లోని ఇబ్బంది లేకుండా వెళ్లేలా చూస్తాం.

● డ్రెయినేజీ ఆక్రమణపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

– ఎం.రాము, కరెంట్ ఆఫీస్‌పక్కన, సత్తుపల్లి

జ: కరెంట్ ఆఫీస్ ముందు డ్రెయినేజీ ఆక్రమణకు గురై మురుగు పారకుండా దుకాణాల్లోకి వస్తున్నట్లు తెలిసంది. తక్షణమే చర్యలు తీసుకొని డ్రెయినేజీని శుభ్రం చేయిస్తాం.

● ట్రాఫిక్ సమస్యను తీర్చండి..

– ఎండీ రఫీ, బ్యాటరీషాపు, సత్తుపల్లి

జ: మహాత్మాగాంధీ పక్కన మెయిన్‌రోడ్‌పై దుకాణాలు వెలిసి ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడుతుందని మా దృష్టికి వచ్చింది. పరిశీలించి చర్యలు చేపడతాం.

● సీసీ రోడ్డు వేయించండి..

– కె.ముత్యాలరావు, కల్పతరురోడ్, సత్తుపల్లి

జ: కల్పతరురోడ్‌లోని విశ్వవిజ్ఞానపీఠం ముందు రోడ్డులో నిధులు రాగానే సిమెంట్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

● రోడ్డును ఆక్రమిస్తున్నారు..

– రోహిత్, గౌతమ్‌మోడల్‌స్కూల్ రోడ్డు, సత్తుపల్లి

జ: గౌతమ్ మోడల్ స్కూల్ రోడ్డులో ఇద్దరు, ముగ్గురు రోడ్డుపైకే ఇళ్ల నిర్మించినట్లు తెలిసింది. టౌన్ ప్లానింగ్‌కు తక్షణం ఆదేశాలు ఇచ్చాం. సత్వరమే పరిష్కరిస్తాం.

● కోతుల బెడద తీవ్రంగా ఉంది..

– మాదిరి మధు, అయ్యగారిపేట, సత్తుపల్లి

జ: రెండురోజుల్లో కోతులను పట్టేవారిని పిలిపించి చర్యలు చేపడతాం. భయపడాల్సిన అవసరం లేదు.

క్లుప్తంగా

ముత్యాల తలంబ్రాల పంపిణీ ప్రారంభం

సత్తుపల్లిటౌన్: శ్రీసీతారాముల ముత్యాల తలంబ్రాలను ఆర్టీసీ కార్గోద్వారా సత్తుపల్లి ఆర్టీసీ డిపో పరిధిలో బుకింగ్ చేసుకున్న వారికి గురువారం డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి కార్యాలయంలో పంపిణీ చేశారు. బుకింగ్ చేసుకున్న వారికి ఇంటి వద్దకే తలంబ్రాలు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. రీజియన్‌లోనే అత్యధిక తలంబ్రాల బుకింగ్‌కు సహకరించిన అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్గో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్‌కె.మునీర్‌పాషా, వీబీఓ కిన్నెర ఆనందరావు, ఏడీసీలు పాల్గొన్నారు.

రుణం చెల్లించకపోవడంతో ఇల్లు సీజ్



బ్యాంక్ అధికారులకు తాళాన్ని అందిస్తున్న ఆర్ఐ శ్రీనివాస్

వేంసూరు: బ్యాంకు ద్వారా తీసుకున్న రుణం చెల్లించకపోవడంతో బ్యాంకు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఇంటిని సీజ్ చేశారు. వేంసూరుకు చెందిన కందికొండ మోహన్ కృష్ణ వేంసూరు యూనియన్ బ్యాంకులో తీసుకున్న రుణం చెల్లించకపోగా, పలుమార్లు అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా స్పందన లేక జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆతర్వాత గురువారం తహసీల్దార్ బాజ్జీప్రసాద్ ఆధ్వర్యాన ఆర్ఐ శ్రీనివాస్ పంచనామా నిర్వహించి ఇంటిని సీజ్ చేసి యూనియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్ రామ్మోహన్, వేంసూరు మేనేజర్ రామ్మోహన్‌రావుకు తాళాలు అప్పగించారు.

వడదెబ్బపై అవగాహన..

తల్లాడ: వేసవికాలంలో వ్యవసాయ కూలీలు, ఉపాధిహామీ కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి రత్న మనోహర్ అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. ఉదయం 11 గంటలు, సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే వ్యవసాయ పనులకు వెళ్లాలని, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



పెనుబల్లి: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

పెనుబల్లి/బోనకల్: రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ తెలిపారు. గురువారం పెనుబల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ×జయ్‌బాపు, జయ్‌భీమ్, జయ్ సంవిదాన్× కార్యక్రమం నిర్వహించి, రాజ్యాంగ ఆవిష్కృతను వివరించి, రాజ్యాంగానికి వ్యతిరేకంగా బీజేపీ చేస్తున్న మత విద్వేష రాజకీయాలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించి.. పెనుబల్లి నుంచి వీయంబంజర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు పెనుబల్లి మండలానికి చెందిన 68మంది లబ్ధిదారులకు.. వారు రూ.23లక్షల 59వేలు విలువగల చెక్కులను అందించారు. అదే విధంగా బోనకల్‌లోని చిరునోములలో జయ్‌బాపు, జయ్‌భీమ్, జయ్ సంవిదాన్ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు ప్రారంభించి.. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు వీరభద్రం, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బొందయ్య, కల్లూరు ఏఎంసీ చైర్మన్ నీరజా చౌదరి, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, దుర్గారావు, జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్వరరావు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహారావు, పీసీసీ మెంబర్ కిషోర్‌కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ రామకోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

అంగన్‌వాడీల్లో 'పోషణ్ పక్వాడ్'



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ కనకదుర్గ

సత్తుపల్లిటౌన్: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఐసీడీఎస్ సీడీపీఓ కనకదుర్గ అన్నారు. పోషణ పక్షం సందర్భంగా పట్టణంలోని సత్తుపల్లి సెక్టార్‌లోని ఎన్టీఆర్‌నగర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వి.సుజాత, అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

● చేతుల శుభ్రతపై అవగాహన

బోనకల్: మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీల్లో పోషణ పక్షోత్సవాల సందర్భంగా గురువారం చిన్నారులకు చేతుల శుభ్రతపై అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. అన్నం తినకముందు.. తరువాత, మలమూత్ర విసర్జన తరువాత చేతులు ఎలా శుభ్ర పరుచుకోవాలో ప్రదర్శన రూపంలో చేసి చూపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, శైలజ, రాజ్యలక్ష్మి, అనిత, రమాదేవి, జయమ్మ, రమ పాల్గొన్నారు.

● స్టేజీపినపాక, కొండకొడిమ గ్రామాల్లో..

వైరారూరల్: మండలంలోని స్టేజీపినపాక, కొండకొడిమ గ్రామాల్లోని అంగన్‌వాడీల్లో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరిత పాల్గొని పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'క్షయ' రహిత సమాజానికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న టీబీ నివారణ నోడల్ అధికారి రామారావు

తల్లాడ: మండలంలోని పీహెచ్‌సీ పరిధిలో పినపాక పంచాయతీలో క్షయవ్యాధి ప్రబలిన మహిళకు వైద్యాధికారి ఐ.రత్న మనోహర్ ఏడు రకాల నిత్యావసర సరుకులు అందించారు. ఆయన మాట్లాడుతూ.. టీబీపై అపోహలు వద్దని, టీబీ పూర్తిగా తగ్గిపోయే జబ్బు అన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు కళావతి, సూపర్‌వైజర్ వై.సురేష్, సంజీవ్‌కుమార్, శ్రీను, సునీత పాల్గొన్నారు.

● తూర్పులోకవరంలో..

కల్లూరురూరల్: టీబీ వ్యాధి నివారణకు వైద్య ఆరోగ్యశాఖ విశేషంగా కృషి చేస్తుందని టీబీ నివారణ నోడల్ అధికారి రామారావు తెలిపారు. గురువారం మండలంలోని తూర్పులోకవరం పంచాయతీలో కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి నజకాంత్ సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీబీ నివారణ గురించి ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని పంచాయతీలను టీబీ రహిత పంచాయతీగా మార్చడం కోసం టీబీ నిర్మూలన విభాగంలోని చికిత్స సూపర్‌వైజర్ వై.సురేష్, ల్యాబ్ సూపర్‌వైజర్ సంజీవ్‌కుమార్, వైద్య సిబ్బంది సహకారంతో పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ సత్యనారాయణ, ఏఎన్ఎం విజయలక్ష్మి, నిర్మల, ఆశా కార్యకర్తలు జమలమ్మ, రాణి లక్ష్మి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి



వైరా: మాట్లాడుతున్న బండారు సరేష్ బాబు

వైరా/ముదిగొండ: బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గావ్ చలో, బస్తీ చలో కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బీజేపీ జిల్లా నాయకుడు బండారు సరేష్ బాబు, పార్టీ మండల అధ్యక్షుడు అల్లిక శ్రీకాంత్ తెలిపారు. గురువారం వైరాలోని బీజేపీ కార్యాలయంలో, ముదిగొండలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తలు సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం వైరాలో.. 195 పోలింగ్ బూత్‌లో జెండా ఆవిష్కరించి ఇంటింటి పర్యటన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు వెంకటకృష్ణ, రామారావు, శ్రీనివాస్, వెంకటేష్‌యాదవ్, కృష్ణారావు, అనీల్, సత్యనారాయణ, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

● **ఆర్థిక సాయం..**

పెనుబల్లి: వీయంబంజర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సడియం వంశీ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విద్రార్థి వైద్య ఖర్చుల నిమిత్తం గౌడ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు వంగా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో.. నాయకులతో పాటు అయన మిత్రుల ద్వారా రూ.1,02,803లను సేకరించారు. ఈ నగదును గురువారం ఎంఈఓ సత్యనారాయణ చేతుల మీదుగా విద్యార్థి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామారావు, వందనం, కృష్ణయ్య, విఠల్‌రావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● **స్నేహితుడి కుటుంబానికి రూ.12 వేలు..**

కారేపల్లి: ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన కారేపల్లి మెయిన్ రోడ్డుకు చెందిన పిట్టల వెంకటేష్(30) కుటుంబానికి.. ఆయన స్నేహితులు గురువారం రూ.12వేలు ఆర్థిక సాయం అందించి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సారయ్య, శ్రీనివాసరావు, రమేష్, సాయి, వెంకటేష్, నాగరాజు, ప్రశాంత్, కృష్ణ, మహేష్, మల్లేష్, ఉపేంద్ర చారి, హుస్సేన్, రామకృష్ణ, తిరపయ్య, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

● **వీల్‌చైర్ వితరణ**



వీల్‌చైర్ అందిస్తున్న కోటేశ్వరరావు

సత్తుపల్లిరూరల్: మండలంలోని సదాశివునిపేట గ్రామానికి చెందిన దివ్యాంగురాలు రెడ్ల లక్ష్మీదుర్గకు వాసవీక్లబ్ మాజీ అధ్యక్షుడు కొత్తూరు కోటేశ్వరరావు, లీలాజ్యోతి దంపతులు గురువారం రూ.6 వేలు విలువైన వీల్‌చైర్ వితరణగా అందించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు సరాబు శివనాధప్రభు, తుంబూరు దామోదర్‌రెడ్డి, రామారావు, గోళ్ల ప్రసాద్, అడపా రవికుమార్ పాల్గొన్నారు.

● **గన్నీ సంచులు వెనక్కి తీసుకున్న సొసైటీ సిబ్బంది**

వైరారూరల్: రైతులకు ఇచ్చిన గన్నీ సంచులను వెనక్కి తీసుకున్న సంఘటన మండలంలోని గరికపాడు సొసైటీ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. గరికపాడులో శీలం అంజిరెడ్డి, బండి హన్మంతరావు, మరికొంత మంది రైతులకు బుధవారం ధాన్యం కాంటాకు అవసరమైన గన్నీ సంచులను ఏఈఓ సూచనలతో సొసైటీ సిబ్బంది ఇచ్చారు. ధాన్యం కాంటాలకు సంబంధించి తేమశాతం, నాణ్యత ధృవీకరణ కూపన్లను ఏఈఓ ఇవ్వాలి.. అయితే కూలన్లు అయిపోవడంతో ఏడీఏ కరుణశ్రీ.. ఏఈఓ కూపన్లు లేకుండా రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయొద్దని తెలిపారు. ఈ క్రమంలో గన్నీ సంచులు వెనక్కి తీసుకోవడంతో రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సొసైటీ సీఈఓ రామకృష్ణ తమ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై సొసైటీ సీఈఓను వివరణ కోరగా.. కూపన్లు లేకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులు కాంటా వేయలేదని, వెంటనే రైతులకు కూపన్లు, గన్నీ సంచులు అందించి కాంటా వేస్తామని తెలిపారు.

సంక్షిప్తంగా..

● **నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం**

కల్లూరు: కల్లూరులోని శ్రీ సంతాన వేణుగోపాల స్వామి వారి దేవాలయ నూతన పాలక మండల కమిటీని ఇటీవల ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ దారా రంగ సుధాకర్ గుప్తాతో పాటు ఆరుగురి డైరెక్టర్లతో గురువారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఈఓ సూర్య ప్రకాశరావు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించగా.. నూతన పాలకమండలికి శుభాకాంక్షలు తెలిపారు.

● **ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల నూతన కార్యవర్గం ఎన్నిక**



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

బోనకల్: మండల కేంద్రంలో గురువారం ఫొటో అండ్ వీడియోగ్రాఫర్లు నూతన మండల కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గం ప్రెసిడెంట్‌గా చిట్టోజు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సారిక చైతన్య, ఉపాధ్యక్షుడిగా కొత్తపల్లి రాజేష్, కోశాధికారిగా కొంగల తిరుపతిరావు, జాయింట్ సెక్రటరీగా షేక్.మదార్‌సాహెబ్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారానికి తహసీల్దార్ పున్న చందర్‌రావు, ఎస్సై మధుబాబు, సంఘం జిల్లా అధ్యక్షుడు మారగాని వెంకట్ తదితరులు హాజరయ్యారు.

● **బీమా నగదు అందజేత**



నగదు అందిస్తున్న చైర్మన్ సాంబశివరావు

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం సొసైటీ సభ్యులు, నర్సింహాపురం గ్రామానికి చెందిన షేక్.జాన్ సాహెబ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన పేరిట సొసైటీలో బీమా చేయగా.. ఆయన మృతి చెందడంతో రూ.50వేలు బీమా మంజూరైంది. కాగా, గురువారం మండల కేంద్రంలోని డీసీసీబీ కార్యాలయంలో బీమా నగదును నామినీ ఇమాంబీకి సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావు, బ్యాంక్ మేనేజర్ దివ్య అందిచారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, జానీ, క్యాషియర్ మౌనిక, సెక్రెటరీ మోహన్‌రావు, సొసైటీ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

● **జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం**

సత్తుపల్లిటౌన్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికై టీడబ్ల్యూజేఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్టిపాటి రాజశేఖర్, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం సత్తుపల్లిలో జరిగిన నియోజకవర్గ స్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులకు రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, రాజీవ్ యువవికాసం పథకాల్లో ప్రాధాన్యత కల్పించేలా కృషి చేస్తామన్నారు.

● **అంకమ్మ జాతర ప్రారంభం**

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో గురువారం అంకమ్మ తిరునాళ్ల ప్రారంభమైంది. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళ తోరణాలు కట్టారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి అభిషేకం, చీర సారెలతో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో దేవాలయం కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు దేవేందర్, వెంకటేశ్వరరావు, నరసింహారావు, వెంకటయ్య, ప్రసాద్, రామారావు పాల్గొన్నారు.

● **శ్రీవారికి పుష్పయాగం**

ముదిగొండ: మండలంలోని ముత్తారంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీవారికి వివిధ రకాల పూలతో గురువారం పుష్పయాగ మహోత్సవం నిర్వహించారు. అర్చకులు బొర్రా వాసుదేవాచార్యులు, శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని అద్దాల మండపం నందు స్వామి పవళింపు సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త వనంవెంటనాగేశ్వరరావు, ఆలయ చైర్మన్ తుళ్లూరి జీవన్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

● **ఆలయంలో అష్టలక్ష్మి పూజలు**

కల్లూరురూరల్: మండలంలోని కప్పలబంధంలోని శ్రీఅంకమ్మ మహాలక్ష్మి అమ్మవార్ల తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా గురువారం ఆలయంలో అష్టలక్ష్మి పూజలు నిర్వహించారు.

● **రగకొప్పెన మహోత్సవం**

సత్తుపల్లిరూరల్: మండలంలోని బేతుపల్లి శ్రీఅంకమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా గురువారం రడక ప్పెర కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి దగ్గర నీళ్లు ఆరబోస్తూ అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● **ధరలు తగ్గించాలి**

తల్లాడ/సత్తుపల్లిరూరల్: పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ.. ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో అన్నారుగూడెంలో గ్యాస్ బండ్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అదే విధంగా సత్తుపల్లిరూరల్ మండలంలోని గ్రామాల్లో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యాన కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం పేద ప్రజలపై భారం మోపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకురాలు గొడ్ల పుల్లమ్మ, బసవమ్మ, సత్యావతి, శ్రీదేవి, లక్ష్మీ, పద్మ, శ్రీను, లాల్‌మియా పాల్గొన్నారు.

● **పరామర్శ..**

వేంసూరు: మండలంలోని భరణిపాడుకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కోటమర్తి పుల్లయ్య ఇటీవల మృతి చెందిగా ఆయన దశదిన ఖర్మ గురువారం నిర్వహించారు.

ఈ వేడుకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రాథోడ్, జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా, మండల అధ్యక్షులు గొర్ల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మట్టా ప్రసాద్‌లు పాల్గొని పుల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇరువురిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని మత్కేపల్లి గ్రామానికి చెందిన బండి మల్లేశం, అతని కుమారుడు రామకృష్ణపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేశం అన్న బండి.నాగేశ్వరరావు పొలం వెళ్తుండగా మార్గమధ్యలో మల్లేశం, రామకృష్ణ ఇరువురు అడ్డుకుని మాకు తెలియకుండా పొలంలో మట్టిని ఎలా అమ్ముకున్నావని అసభ్య పదజాలంతో దూషిస్తూ రాళ్లతో కొట్టి చంపుతామని బెదిరించారు. దీంతో జరిగిన ఘటనలో నాగేశ్వరరావుకు కుడి భుజం, మోకాలుకు గాయాలైనాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు మల్లేశం, రామకృష్ణ లపై ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

ఎర్రుపాలెం: మండలంలోని పెద్దగోపవరం, ఎర్రుపాలెంతో పాటు మొత్తం 9 గ్రామాల్లో 163 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ ఏఈ అనూష, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 16గ్రామాల్లో 251 స్తంభాలకు గానూ.. ప్రభుత్వం రూ. 21.99 లక్షలు వెచ్చిందన్నారు. ఇప్పటికే 60శాతం మేర పనులు పూర్తి అయ్యాయన్నారు. కార్యక్రమంలో ఏఎల్ఎం వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర రెడ్డి, ఓబుల్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, వసంతకుమార్ తదితరులున్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో.. అడ్మిషన్లు ప్రారంభం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరగోరు బాలికల కోసం అడ్మిషన్లు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రజిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీకామ్‌జనరల్, బీకామ్ సీఏ, బీఏ, లైఫ్ సైన్స్, డాటా సైన్స్‌లో అడ్మిషన్లు కోరుతున్నట్లు తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన గిరిజన బాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు.

ఆదర్శ కమ్యూనిస్టు రజబ్ అలీ

కొణిజర్ల: సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా పని చేసినప్పటికీ మచ్చ లేకుండా నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన ఆదర్శ కమ్యూనిస్టు రజబ్ అలీ అని సీపీఐ జిల్లా నాయకుడు యర్రాబాబు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే షేక్ రజబ్ అలీ 29వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక దొండపాటి భవన్‌లో సీపీఐ నాయకులు రజబ్‌అలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సీతారాములు, సోమయ్య, వెంకటేశ్వర్లు, వెంకయ్య, వెంకన్న, రామారావు, ఆదిరెడ్డి, లక్ష్మయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలి

బోనకల్: గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల జీతాలను జాప్యం చేయకుండా సకాలంలో చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు ప్రతీ నెల మొదటి తేదీనే జీతాలు చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు రంగారావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సద్దాబాబు, కోటయ్య, సౌభాగ్యలక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వేంసూరు: మండల పరిధిలోని వెంకటాపురం, దుద్దెపూడి సొసైటీల ఆధ్వర్యంలో భీమవరం, లచ్చన్నగూడెం, చౌడవరం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి, భరణిపాడు సొసైటీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, పుచ్చాకాయల సోమిరెడ్డి, గరికపాటి శ్రీనివాసరావు, అధికారులు రైతులు పాల్గొన్నారు.

● **చంద్రుపట్లలో..**

కల్లూరురూరల్: మండలంలోని చంద్రుపట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్, ఏఓ రూప, మార్కెటింగ్ డైరెక్టర్లు వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, జగదీష్, రైతులు పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయినాథుడి ఆలయాల్లో బాబాకి గురువారం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. కర్పూర హారతులిచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో.. జయంతి గ్రామానికి చెందిన ఉమ్మా రామకృష్ణారెడ్డి – స్వాతి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి



చింతకాని: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న లింగాల కమల్‌రాజ్, కొండబాల కోటేశ్వరరావు

బోనకల్/చింతకాని: బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ జెడ్పీచైర్మన్, పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కోటేశ్వరావు పిలుపునిచ్చారు. గురువారం బోనకల్‌లోని.. రావినూతల గ్రామంలో, చింతకానిలోని లచ్చగూడెంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రుణమాఫీ, రైతుభరోసా పథకాల్లో రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. అనంతరం రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు మల్లిఖార్జున్‌రావు, నాగేశ్వరరావు, పుల్లయ్య, మధిర మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, కొండ ఉపేందర్, రవి, ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, నాయకులు హనుమంతురావు, రమేష్, నర్సయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.